# లైఫ్‌టైం అఛీవ్‌మెంట్

శ్రీధర



**ఆమ్‌స్టర్‌డామ్ విమానాశ్రయంలో అంతర్జాతీయ టెర్మినల్‌లో సెకండ్ లెవెల్లోని పాసింజర్స్ లాంజ్‌లో కూర్చుని ఉంది పరిమళ. శాన్ ఫ్రాన్సిస్కో విమానం ఎక్కడానికి ఇంకా అయిదు గంటల టైం ఉండడంతో లాంజ్‌లో జనం పల్చగా ఉన్నారు. గంటల కొద్దీ విమానాల్లో సీటుకు కట్టేసినట్లు కూర్చుని ప్రయాణం చేయటమే బోర్. ఇక మధ్యలో గంటల కొద్దీ వెయిటింగ్ అంటే...పెద్ద పనిష్మెంటే.**

నిలువెత్తు గాజు గోడల నుంచి చూస్తుంటే రన్‌వేతో పాటు సగం విమానాశ్రయం కనిపిస్తోంది. పొద్దుటి నుంచీ కురుస్తున్న వానలో లోహ విహంగాలు షవర్‌బాత్ చేస్తున్న దృశ్యం పరిమళ దృష్టిని ఆకర్షించడం లేదు.

రాత్రి హైదరాబాద్‌లో బయల్దేరే హడావుడిలో సరిగ్గా భోం చెయ్యలేదు. ఫ్లయిట్‌లో ఇచ్చిన డిన్నర్ ఏ మాత్రం రుచించలేదు. ఫస్ట్ లెవల్‌లో ఉన్న కెఫెలోనూ ఏమీ తిన బుద్ధి కాలేదు. ఫ్రెంచ్ ఫ్రయ్‌తో ఆకలి తీరదు.

ఇంటికి ఫోన్ చేసి బేబీతో మాట్లాడుదామని అనుకుంది. టైం చూసుకుంది. అది ఇంకా నిద్ర లేచి ఉండదు. ఏ తెల్లవారుజామునో కొంపకొచ్చి పడుకుని ఉంటుంది. తను దగ్గర లేకపోతే అడిగే వాళ్లెవరున్నారు?

దానికి ఫ్రెండ్స్ ఉంటే, ఇంకెవరితోనూ పనిలేదు. చేతిలో కారూ, కార్డూ ఉంటే, ఇంక తక్కువేమి మనకు- అని పాడుకుంటూ, ఆడుకుంటూ తిరగొచ్చు, ఇల్లూ వొళ్లూ మరచి. యవ్వనారంభవేళలో కలిగే ఆలోచనలు, అలవాట్లు, ఆవేశకావేషాలూ ఇవి భవిష్యత్తును తీర్చి దిద్దుతాయి.

అమెరికలోనే పుట్టి పెరిగిన బేబీకి అక్కడి కల్చర్ అంతా అబ్బింది. ఇండియాలో పుట్టి, పాతికేళ్లు ఇక్కడ పెరిగిన పరిమళ ఎంత రాజీ పడినా కూతుర్ని కంట్రోలు చేయడం చేతకావడం లేదు. రోజూ బాయ్‌ఫ్రెండ్స్ వచ్చి ఇంటి ముందు హారన్ కొట్టగానే, దీని కారు బయల్దేరుతుంది. ఈ స్నేహాలు ఎటు దారి తీస్తాయో తెలియదు. ఈ తిరుగుళ్లు ఏమిటే- అంటే 'ఒంటరిగా ఎవరుంటారు మమ్మీ జైల్లో ఖైదీలు తప్ప'- అంటుంది.

ఈ మధ్య వినోద్ అనే కుర్రాడితో స్నేహం చేస్తోంది. అతనూ ఎన్నారై. రెండు,మూడు సార్లు ఇంటికి తీసుకొచ్చింది. ఆ కుర్రాడికి 'ముట్టె పొగరెక్కువ' అనిపించింది. వాడి ప్రభావం నుంచి బయటకు లాక్కురాకపోతే, బేబీకి భవిష్యత్తు లేదనిపించింది.

ఇలాంటి సమయంలో దాన్ని అక్కడ ఒక్కదాన్నీ వదలి హైదరాబాద్ బయల్దేరడం ఇష్టం

లేకపోయినా, తప్పనిసరి అయింది. అద్దెకున్న వాళ్లు ఖాళీ చేయకపోగా, ఇంటిని వాళ్లు కొనుక్కున్నట్లు చెబుతున్నారట. ఈ విషయం తెలియగానే, ఆ ఇల్లు చెయ్యి జారిపోతుందేమోనన్న భయంతో హడావుడిగా బయల్దేరింది. ' ఆ ఇల్లు అమ్మి పారెయ్' అంటుంది బేబీ. కానీ పరిమళ అంత తేలికగా నిర్ణయించుకోలేక ఇన్నాళ్లూ ఆగింది. ఆమెకాఇంటితో ఎంతో అనుబంధం ఉంది. చిన్నప్పుడు ఇల్లంతా పరుగులు పెడుతూ తిరిగిన జ్ఞాపకాలు, అమ్మ తనని ఎత్తుకుని చందమామను చూపిస్తూ ఒక్కొక్క ముద్దా తినిపించిన దృశ్యాలూ, తండ్రి గుండెల మీద పడుకుని నిద్రపోయిన సందర్భాలూ..ఇలా ఎన్నెన్నో అనుభూతులు, అనుభవాలు... ఆ ఇంటితో ముడిపడి ఉన్నాయి. వాటిని చెరిపేసుకోలేకనే మథన పడుతోంది.

ఎప్పుడూ ఎవరితోనూ చెప్పకపోయినా ఆమె రెండు మూడేళ్లకో సారి అయినా హైదరాబాద్ రావడానికి కారణం త్యాగరాజు. అతను తనకు ఏమవుతాడు? అన్న ప్రశ్న ఆమెను తరుచూ వెంటాడుతూనే ఉంది. కొన్ని ప్రశ్నలకు సమాధానాలు దొరకవు.

త్యాగరాజుతో పరిచయమే చిన్న సానుభూతితో ప్రారంభమైంది. అతని జీవితం ఇంత నిర్లిప్తంగా సాగటానికి కారణం తనేనేమో... అన్న భావనా కలుగుతోంది.

పరిమళకు క్లాస్‌మేట్, క్లోజ్‌ఫ్రెండ్ అయిన జ్యోతికి అతను మేనత్త కొడుకు. అన్నీ బావుండి ఉంటే జ్యోతి అతని భార్య అయ్యేది. అలా కాకపోవడానికి కారణమూ తనేనన్న బాధ కూడా పరిమళను వేధిస్తోంది.

జ్యోతిని రోజూ ఏదో విధంగా ఆటపట్టించడం, ఏడిపించడం పరిమళకు అలవాటు. ఒక రోజు జ్యోతిని కంగారు పెట్టడం కోసం ఆమె బ్యాగ్‌లోంచి ఒక కవరు తీసి తన బ్యాగ్‌లో పుస్తకాల మధ్య దాచేసింది పరిమళ. జ్యోతి దాన్ని గమనించలేదు. పరిమళ కూడా ఆ తరువాత ఆ కవరు గురించి మర్చిపోయింది. మూడు నెలల తరువాత ఆ కవరు మళ్ళీ పరిమళ దృష్టిలో పడింది. తీసి చూస్తే దాన్లో ఎవరివో ఒరిజనల్ సర్టిఫికెట్స్ ఉన్నాయి. క్షమాపణలతో ఆ కవరు జ్యోతికి ఇచ్చింది.

''ఇంక ఇప్పుడేమనుకుని లాభం లేదు! ఈ సంవత్సరానికి మా బావ చదువు ఆగిపోయింది. మన క్లాస్‌మేట్ రమ్య ఫాదర్ గెజిటెడ్ ఆఫీసర్ గదా! అటెస్టేషన్ కోసం దానికి ఇద్దామని తీసుకొచ్చాను. ఎంత వెతికినా కనపడలేదు. ఒరిజనల్ సర్టిఫికెట్స్ అంత నిర్లక్ష్యంగా పారేసినందుకు మా వాళ్లంతా నన్ను తిట్టారు. డూప్లికేట్స్ కోసం అప్లయి చేసే లోపే కాలేజీలో చేరే గడువు దాటిపోయింది. అందుచేత మా బావకు ఈ ఏడాది కంప్లీట్ రెస్ట్. దానికి అతనేం పెద్దగా ఫీలవటం లేదు. మా బావకు లావుపాటి పుస్తకాలంటే భయం. ఈ పుస్తకమంతా చదవాలా అని దిగులు పడిపోతాడు'' అని నవ్వేసింది జ్యోతి.

తన వల్ల చదువుకు బ్రేక్ పడిన త్యాగరాజును చూడాలనుకుంది పరిమళ. ఓ ఆదివారం సాయంత్రం జ్యోతి వాళ్లింట్లో త్యాగరాజుతో పరిచయం అయింది. చదువు ఆగిపోయినందుకు ఒక రకంగా అతను సంతోషిస్తున్నాడేమోనన్న అభిప్రాయమూ కలిగింది.

''నా మరదలు సర్టిఫికెట్లు దాచేసి మూన్నెళ్ల తరువాత ఇచ్చిందండి. దాని కన్నా ఎక్కువ ఎక్కడ చదివేస్తానో, ఎక్కడ నన్ను పెళ్లి చేసుకోవాల్సి వస్తుందోనని దాని భయం. పోన్లెండి..అది సంతోషంగా ఉంటే చాలండి....''అని నవ్వాడు త్యాగరాజు.

త్యాగరాజు అందంగా ఉంటాడు. నవ్వితే ఇంకా అందంగా ఉంటాడు. తెల్సో..తెలియకో అతన్ని దెబ్బ తీసామన్న గిల్టీ ఫీలింగ్ జ్యోతికి, పరిమళకూ ఉంది.

అందుకని అతనితో కారెమ్స్, పేకాట, బాడ్మింటన్ వంటి ఆటలతో కాలక్షేపం చేసే వారు. ఆ ఆటల్లో ఎప్పుడూ పరిమళే అతని పార్ట్‌నర్‌గా ఉండేది.

''అది నా పార్ట్‌నర్‌గా ఉండనుకోండి...కావాలనే ఓడించేస్తుంది. అది గెలవటమే నాక్కావాలి.. యావండీ...! మన కోసం మనం బతకటం గొప్ప కాదండి!...మన వాళ్ల కోసం బతకటంలో ఎంతో ఆనందం ఉందండి....!'' అనేవాడు త్యాగరాజు ఆట మధ్యలో టిఫిన్ ఆరగిస్తూ.

అలా ఆగిపోయిన చదువు జోలికి మళ్లీ పోలేదు త్యాగరాజు. ఖాళీగా ఉన్న అతనికి ఆ వీధిలోనే ఉంటున్న ఒక నాటకాలరాయుడితో పరిచయం అయింది. నాటకాల్లో చిన్న చిన్న వేషాలు వేయడం ప్రారంభించాడు. ఇంక అదే అతనికి లోకం అయింది. పౌరాణిక నాటకాల్లో వేస్తే విగ్రహం నిండుగా ఉండేది. రాజు వేషాలకు ఠీవిగా కనబడేది. కష్టపడి వాచకంతో పాటు, పద్యాలు పాడటమూ నేర్చుకున్నాడు.

రెండు మూడు నాటకాలకు తనూ,జ్యోతి వెళ్లారు. రాజుగా బాగానే రాణించాడు. నాటకం అయ్యాక 'బావుంది' అని జ్యోతి చెబితే అతనికి తృప్తి కలిగేది కాదు.

''మీరు చెప్పండి...నేను పనికొస్తానా?...'' అనేవాడు.

''అయ్యో, పనికిరావటం ఏమిటి? కృష్ణుడి వేషంలో మీరే కళ్ల ముందు కదులుతుంటేను....'' అనేది పరిమళ.

''అయితే నేను వేషాలు వేస్తేగాని మీ కళ్ల ముందు కదలనన్నమాట...'' అని నవ్వేవాడు... నిండు చంద్రుడిలాగా.

తరువాత సంవత్సరం జ్యోతి పోరి అతన్ని కాలేజీలో చేర్పించింది. తనే ఫీజు కట్టింది.

''చదవకపోతే నా మీద ఒట్టే'' అంది జ్యోతి.

''నా మీద కూడా....'' అన్నది పరిమళ.


''అయ్య బాబోయ్...మీరెన్ని ఒట్లు వేసినా... తిట్లు కూసినా...మన ఒంటికి పడని విషయం అది.... చదివినాగుర్తుండదు....''అన్నాడు త్యాగరాజు.

''ఏదీ నాటకంలోని ఒక డైలాగ్ చెప్పు, విందాం....'' అన్నది పరిమళ.

''అలా అన్నారు బావుంది! ..కడు రయంబున జను నోకకాంతగాంచి తన్వియెట బోయె దెవ్వరిదాన వనిన, మగువ యూరక చని యొక్కమారు వెక్కుటయను....''

''అంతలేసి డైలాగులు చెప్పగా లేనిది...చిన్నచిన్న వాక్యాలు ఉండే ఈ పుస్తకాలు చదవటానికేమి?'' అని అడిగింది పరిమళ.

''ఏమి అంటే ఏమీ లేదు, ఆ డైలాగులతోనే



బుర్ర వేడెక్కిపోతుంటే, ఇక మళ్లీ ఈ చదువులా?'' అన్నాడు త్యాగరాజు.

మొత్తం మీద అతనికి పెద్దగా చదువు అబ్బలేదు. ఒక ఏడాది చూసి కాలేజ్ మానేశాడు.

జ్యోతి,పరిమళ చదువు పూర్తయ్యేనాటికి, త్యాగరాజు మంచి నటుడిగా పేరు తెచ్చుకున్నాడు.

జ్యోతి పెళ్లి సెటిల్ అయింది వేరే అతనితో...

''త్యాగరాజు పాపం ఫీలవుతుంటాడు....'' అన్నది పరిమళ, జ్యోతితో.

''ప్రతిదానికీ అర్హత, యోగ్యతా కూడా ఉండాలి కదా. నాకు ప్రధానమంత్రి కావాలని ఉంది...కాలేదని ఫీలయితే ఏం లాభం? ఆ నాటకాలు తప్ప అతనికి మరో ప్రపంచం గురించి పట్టదు. చెల్లియో....చెల్లకో...అనుకుంటూ కూర్చుంటే, జీవితం గడవాలి కదా.....'' అన్నది జ్యోతి.

ఆమె అన్న మాటల్లోనూ నిజం ఉందనిపించింది.

ఏడాది తిరగకుండానే పరిమళకూ అమెరికా అబ్బాయితో పెళ్లి నిశ్చయమైంది.

ఈ విషయం పరిమళ చెప్పినప్పుడు త్యాగరాజు మనసులో ఏమున్నా పైకి మాత్రం ఎప్పటిలా నవ్వాడు..నిండు చంద్రుడిలా...

''నువ్వు కూడా పెళ్లి చేసుకుంటే బావుంటుంది గదా'' అన్నది పరిమళ.

'' నా పెళ్లికి నేను రెడీ, పురోహితుడు రెడీ, భజంత్రీలు రెడీ,నాలుగింట మూడొంతులు రెడీ.. ఎటొచ్చీ పెళ్లి కూతురే దొరకాలి...''

''ఎలాంటి అమ్మాయి కావాలి?''

''అల్లాటప్పాలాంటి అమ్మాయిలను చేసుకోడీ విజయనగర సామ్రాజ్యాధినేత...అమ్మాయిని చూడగానే...కోడలా ఇంక బంగారుగోడలేల, మేడలేటికీ, రతనంపులాడలేల..మాడలేటికీ బలురాచ జాడలేల..వాడలో నీవు ద్రిమ్మర నోడి చనిన....'' అని లోకమెల్ల కొనియాడవలె....'' అన్నాడు త్యాగరాజు.

లోలోపల ఎంతో మనోవేదనను అనుభవిస్తున్నా, పైకి మాత్రం ఆ బాధను వెలిబుచ్చకుండా బాగానే నటించాడు.

జ్యోతి భర్తతో ఢిల్లీ వెళ్లిపోయింది.

పరిమళ తన జీవిత భాగస్వామితో అమెరికా వెళ్లిపోయింది.

''సప్తసముద్రాలకవతల...అలా అమెరికాలో నగరిలో సౌధంబులో... ఉండబోతున్నారు. ఇక్కడ ఇన్నాళ్లూ మీతో అప్పుడప్పుడూ కలిసి తిరిగిన ఓ పగటి వేషగాడ్ని .....నేను ఎప్పుడన్నా గుర్తుకొస్తే ఓ లేఖ రాస్తారా? అమెరికాలోనూ నాకు తెల్సిన వాళ్లున్నారని మా నాటక సమాజం వాళ్లకు గొప్పగా చూపించుకుంటాను'' అని త్యాగరాజు అన్నప్పుడు, పరిమళ కళ్లలో నీళ్లు తిరిగాయి.

గొంతులో హాలాహలాన్ని దాచుకుని, పైకి అదే చిరునవ్వు నవ్వగలిగాడు. 'సెబాష్! నిజంగా నీ అంత గొప్ప నటుడు ఎవరూ ఉండరని నాకు తెల్సు. నేను అటు తిరగ్గానే నీ కళ్ల వెంట జలపాతాలు పారుతాయని....'అనుకుంది పరిమళ.

అమెరికాలో దిగినప్పటి నుంచీ...అదో వింత ప్రపంచం... ఇక్కడ అధ్యక్షుడ్ని తిట్టవచ్చు... కానీ కానిస్టేబుల్‌కి ఎదురు చెప్పగూడదు. ఆకాశాన్ని అంటే మేడలు...పాతాళానికి దిగజారిన విలువలు...ఎవడి విషయాలూ ఎవడికీ తెలియనివ్వడు.... ప్రైవసీ! ప్రతి మనిషీ దుర్భేధ్యమైనకోట. ఆత్మీయతలూ,అనుబంధాలూ అన్నీ ఉన్నాయి. కానీ ఎవరి కోసమూ ఎవరి సుఖాన్నీ వదులుకోరు. ఎక్కడా త్యాగం, ధర్మం అనేవి వినిపించవు. భారతదేశంలో భక్తి ఎక్కువ. ఈ జన్మలోనే కాదు, వచ్చే జన్మలోనూ సుఖశాంతులు కోరుకుంటూ సంపాదించిన దాంట్లో సగానికిపైగా ఖర్చు పెడుతారు పుణ్యం కోసం. అమెరికన్లు ఏ వారం గడించింది...ఆ వారం ఖర్చు చేస్తారు..... ఆనందిస్తారు ఎప్పటికప్పుడు. మనం భవిష్యత్తు జీవనం కోసం భయపడతాం. వాళ్లకు రేపటి భయం లేదు.

కాలం ఎవరి కోసమూ ఆగదు. ఈ వెలుగు చీకటి తెరల మధ్య ఎన్నో మార్పులు, చేర్పులు.

పరిమళ తల్లి అయింది. బేబీ ఆమె సర్వస్వం అయింది. నాలుగేళ్ల తరువాత తట్టుకోలేని ఎదురు దెబ్బ. కారు యాక్సిడెంట్‌లో పరిమళ భర్త చనిపోయాడు.

వెళ్లినప్పటి నుంచీ ఉద్యోగం చేస్తూనే ఉంది పరిమళ.

భర్త పోవటంతో భారం మరింత పెరిగింది..!.. అయినా తట్టుకుని నిలబడింది.

తల్లిపోయింది...మరో ఏడాదికి తండ్రిపోయాడు.... ఒంటరిదై పోయింది పరిమళ.

ఏడాదికి, రెండేళ్లకీ హైదరాబాద్ వస్తూనే ఉంది. వచ్చినప్పుడల్లా త్యాగరాజును కలుస్తూనే ఉంది.

అతనిలో వచ్చిన మార్పు...ఏమిటంటే గొప్ప నటుడన్న కీర్తి,ప్రతిష్టలు లభించాయి. కానీ మధ్యాహ్నం భోజనానికి ఎలా? అన్న ప్రశ్నని అతను ఎదుర్కొనలేపోతున్నాడు.

అతని పరిస్థితికి పరిమళ జాలి పడింది... బాధ పడింది.

''పెళ్లి చేసుకుంటే భార్య తోడుగా ఉంటుంది గదా..కష్టసుఖాలు పంచుకోవటానికి'' అన్నది పరిమళ.

''నాకేం తక్కువ ఒక్కో నాటకంలో ఒక్కో భార్య.. ఆ కాసేపు కౌగలించుకుంటాను... కోపగించుకుంటాను...

దగద్ధాయమానమైన సింహాసనాలు, కిరీటాలు, గదలూ, చీనీ చీనాంబరాలు..... బహుపరాక్‌లు పలికే సేవకులు... లాలించే రాణులు... ఆజ్ఞలు... శిరసావహించే మంత్రులు.... నాకేం తక్కువ ఆ కాసేపూ...'' అన్నాడు త్యాగరాజు.

''కానీ అదంతా కాసేపే గదా!.... తరువాత?'' అని అడిగింది పరిమళ.


''కొన్ని విషయాలు తెల్సుకోకపోవటమే మంచిదేమో!'' అన్నాడు అతను.

'' నా విషయాలూ నీకూ, నీ విషయాలూ నాకూ తెలియనివ్వకపోతే...మన స్నేహానికి అర్థం లేదు.......''

''ఇప్పుడు నిజం చెప్తున్నాను విను. నాకు పెళ్లి కాలేదని తెల్సి, నా పక్కన నటించిన ప్రతీ నటి, నాపైన వల విసిరింది.మామూలుగా అయితే, ఆ వలలో పడని వాడు ఉండడు. కానీ వాళ్లు నా భార్యగా నటిస్తూ నా కౌగిట్లో చేరినప్పుడు కూడా...నాకు వాళ్లలో మరెవరో కనిపించి కనుమరుగయ్యే వాళ్లు....''

''అంటే?!''

''నన్ను క్షమించు. ఇంతకన్నా ఇంక వివరంగా చెప్పలేను...'' అని అంటున్నప్పుడు మొదటిసారిగా



అతని కళ్లలో నీరు ఆమె కంటబడింది.

పరిమళ అర్థం చేసుకుంది.ఇంకెప్పుడూ అతని పెళ్లి ప్రస్తావన తీసుకురాలేదు.

మర్నాడే అతని పేరు మీద సిటీ బ్యాంక్‌లో ఎకౌంట్ ఓపెన్ చేసింది. వీలున్నప్పుడల్లా వెయ్యి డాలర్లు, రెండువేల డాలర్లు అతని ఖాతాకి ట్రాన్స్‌ఫర్ చేస్తోంది.

''నాకు మీరొకమాట ఇవ్వాలి. ఈ ఎకౌంట్‌లోని డబ్బు మీ పర్సనల్ అవసరాలకు మాత్రమే వాడుకోవాలి. ఇతరులకు అప్పులివ్వడంగానీ, నాటక సమాజాలకు ఖర్చు చెయ్యటంగానీ....నాకు ఇష్టం ఉండదు. మీరు తిండి,బట్టకూ ఇబ్బంది పడకూడదనే ఈ ఏర్పాటు చేస్తున్నాను....'' అన్నది పరిమళ.

''అయినా వాళ్లెవరూ నన్ను పట్టించుకోవటం లేదు. పరాయి దేశం నుంచి నన్ను వెతుక్కుంటూ వచ్చి, నా మీద ఇంత దయను, జాలినీ కురిపిస్తున్నారు? నేను మీకేమవుతానని?'' అని అంటున్నప్పుడు కన్నీటి బొట్లు జలజల రాలి పడ్డాయి.

''అయినవాళ్లంతా వదిలేసినప్పుడు వచ్చి ఆదుకునే వాళ్లే నిజమైన స్నేహితులు...ఏదీ ఒక్క డైలాగు చెప్పు నా చెవుల తుప్పు ఒదిలేలాగా.....' అని అడిగింది పరిమళ.

''క్షమించు, ఇప్పుడు నాకు గొంతు పెగలటం లేదు. ఇంత సహాయం చేస్తున్న మీకు ఇవ్వటానికి నా దగ్గరేముంది...గుండెలో నిండిపోయిన కృతజ్ఞత తప్ప....''

''ఒక డైలాగు కొట్టు....''

''ఏదీ గుర్తు రావటం లేదు.....''

''గుర్తొచ్చిందే చెప్పు....''

''అది బాగుండదు.....''

''మనిద్దరమే కదా! ఎవరున్నారు?''

''ఎవరూ లేరు గనుకనే! నాకు భిక్షపెట్టిన దాతవు....పిచ్చికూతలు కూసి నీ మనసు నొప్పించలేను''

'' కోట్లకు పడగలెత్తిన దేవుళ్లకు లక్షలు విరాళాలిస్తే పుణ్యం వస్తుందని అందరూ అనుకుంటారు. అది ఎంత వరకు నిజమో నాకు తెలియదుగానీ, కృంగిపోతున్న వ్యక్తిని నిలబెట్ట టానికి ప్రయత్నిస్తే అంతకు మించిన పుణ్యకార్యం మరొకటి ఉండదని తలుస్తాను.....'' అన్నది పరిమళ.

''దేవతలు ఎక్కడో స్వర్గ లోకాల్లో తిరుగరు. మనుషుల రూపంలో వాళ్లు మన మధ్యనే తిరుగుతారు'' అన్నాడు. నమస్కరించబోతున్న అతని చేతుల్ని పట్టుకుని ఆమె వారించింది.

''ఎప్పుడు ఎవరికి ఏది ఎంత ఇవ్వాలో...అంత ఇచ్చేది, ఇప్పించేది ఆ భగవంతుడే....ఇందులో ఆయన స్వార్థం ఆయనకుంటుంది.....''

''అదేమిటి?''

''దేవుడూ తక్కువ వాడేం కాదు. ఒక్క విషయం నాకు అర్థం కాదు. భారతంలో అడుగడుగునా కృష్ణుడు పాండవులకు సాయపడినట్లు కనిపిస్తాడు. కానీ నిజానికి ఎవరికెవరు సాయపడ్డారంటావ్?''

''అదీ నువ్వే చెప్పు.....''

''యుగాంతానికి జననష్టం కలగాలి. అలా జననష్టం కలిగించాల్సిన అవసరం కృష్ణుడిది. తన అవసరం కోసం కురు పాండవ సంగ్రామం జరిపించాడు....యుద్ధం చేయటం కోసం పాండవులను ఆదుకున్నాడు....''

''సెబాష్, వెయ్యాలి నీకో వీరతాడు...''

ఇదంతా జరిగి నాలుగేళ్లయింది. ఈ మధ్య త్యాగరాజు ఘనకీర్తి గురించి పరిమళ వింటూనే ఉంది.

# తిరుగులేని విలన్



ప్రముఖ నటుడు కైకాల సత్యనారాయణ 'సిపాయి కూతురు' చిత్రంతో హీరోగా పరిచయమయ్యారు. అంతవరకూ వేషాల కోసం చెప్పులు అరిగిపోయేలా తిరిగి తిరిగి విసిగి వేసారి ఇక తిరిగి ఇంటికి వెళ్లిపోదామనుకున్న తరుణంలో అనుకోకుండా లభించిన అవకాశం అది. అయితే ఆ సినిమా విజయవంతం కాకపోవడంతో పరిస్థితి మళ్లీ మొదటికే వచ్చింది. ఇక హీరో వేషాలు లాభం లేదు విలన్‌గానన్నా అవకాశాలు దొరకుతాయేమోనని సత్యనారాయణ చేసిన ప్రయత్నాలు సత్ఫలితాలనే ఇచ్చాయి. తిరుగులేని విలన్‌గా ఆయన పేరు తెచ్చుకున్నారు. 'సిపాయికూతురు' చిత్రంలో తనకు అవకాశం ఎలా లభించిందో నత్యనారాయణ ఇలా వివరించారు.

'1956 సెప్టెంబర్‌లో వేషాల కోసం మద్రాసు వచ్చాను. సంవత్సరన్నర గడిచింది. కడుపునిండా తిండి పెట్టే అవకాశం ఒక్కటీ రాలేదు. అన్ని అవకాశాలు వచ్చినట్టే వచ్చి దూరమయిపోయేవి! ఆ18 మాసాల కాలంలో రెండు పూటలా తినడానికి ఎన్ని బాధలు పడ్డానో ఆ భగవంతునికే తెలుసు. విసుగు పుట్టింది. ఇంటికి తిరిగి వెళ్లి పోదామనుకుని నిర్ణయించుకున్నాను.అయితే సినిమాలలో వేషాలు వేస్తానని కాలరు ఎగరేసి మరీ మద్రాసు వచ్చాను. ఒక్క చిన్న వేషం కూడా వేయకుండా ఇంటికి తిరిగి వెళితే అందరూ ముఖాన నవ్వుతారే...అనే బాధ ఎక్కువైంది. చివరి ఛాన్సుగా డి.ఎల్ .నారాయణగారిని కలుద్దామనుకుని ఓ రోజు ఉదయం వెళ్లాను. 'చాలామంది అవకాశం ఇస్తామన్నారు. ఒక్కరూ ఇవ్వలేదు. మీరయినా చిన్నవేషం ఇప్పించండి' అని ప్రాధేయపడ్డాను. నీ ఫోటోలు ఏమయినా ఉన్నాయా? అని అడిగారాయన. వెంటనే తీసి చూపించాను. 'బాగానే ఉన్నావుగానీ నా దగ్గర హీరో వేషం తప్ప ఇంకోటి లేదే' అన్నారు.

'నేను హతాశుడనయ్యాను. చిన్నవేషమే ఇవ్వని వారు హీరో వేషం ఇస్తారా! ఒకవేళ అడిగినా అత్యాశ అవుతుంది కదా' అని మదనపడుతున్నాను. ఇంతలో డి.ఎల్‌గారు ఇదిగో అబ్బాయ్! నువ్వు ఇంతకుముందు ఏ సినిమాలోనూ చిన్నవేషం కూడా వేయలేదు కదా!' అని అడిగారు. 'వేయలేదండీ' అని జవాబిచ్చాను. 'అలా అయితే నాచిత్రంలో హీరో వేషం నీకే ఇస్తాను!' అన్నారాయన!

'కలా! నిజమా! డి.ఎల్ గారు చెబుతున్నది నిజమేనా! లేక నా నిస్సహాయతను, పరిస్థితిని చూసి జోక్ చేస్తున్నారా! ఏది నమ్మాలో తెలియని పరిస్థితిలో పడ్డాను.

నిజంగానే హీరో వేషం ఇస్తానయ్యా.అయితే ఒక షరతు! నువ్వు వేరే చిత్రాలలో చిన్న వేషాలు వేయకూడదు' అన్నారు ఆయన. తలవూపాను. కాస్ట్యూమ్స్ డిజైనర్‌ను పిలిచి కొలతలు తీసుకోమన్నారు. 1958 జూన్ 19న మేకప్ టెస్ట్ జరిగింది. జూన్ 26న అగ్రిమెంట్ చేశాను. జూలై రెండున షూటింగ్ ప్రారంభమైంది. అగ్రిమెంట్ అయిన రోజున నాకు కలిగిన ఆనందం అంతా ఇంతా కాదు! ఇంటికి తిరిగి వెళ్లి పోదామనుకున్న తరుణంలో ఈ అవకాశం అందులోనూ హీరో ఛాన్సు రావడం జీవితంలో మరువలేని, మరపురాని ఆనందం కలిగించింది.

ఈ సారి మాత్రం ఇంటిని అమ్మటం కోసం వచ్చింది. అద్దెకున్న వాళ్లు పెద్ద ప్లాను వేశారు. ఇల్లు ఇదివరకే అమ్ముడైపోయిందని తామే కొన్నామని అందరికీ చెబుతున్నారు.

పరిమళ వచ్చి ఇల్లు ఖాళీ చేయమంటే, వాళ్లు ఖాతరు చేయలేదు. ఆమె త్యాగరాజుతో విషయ మంతా చెప్పింది.

త్యాగరాజుకు నాటకాల ద్వారా ఒక మంత్రితో పరిచయం ఏర్పడింది. ఆమెను ఆ మంత్రి దగ్గరకు తీసుకెళ్లాడు. ఆయన ఆ ఏరియా డియస్పీకి ఫోన్ చేశారు.

వారం రోజుల్లో ఇల్లు ఖాళీ అయింది. ఆ మంత్రిగారే ఆ ఇంటిని ఒక గవర్నమెంటు హాస్టల్‌కు తీసుకునే ఏర్పాటు చేశాడు. అద్దె కూడా ఆమె ఊహించిన దానికి రెట్టింపు వచ్చింది.

''చిన్నప్పుడు మా అమ్మ అంటుండేది...నువ్వు ఎవరికైనా సాయం చేస్తే భగవంతుడు నీకు పది రెట్లు సాయం చేస్తాడని, అదే నిజమైంది...'' అని సంతోష పడింది పరిమళ. ఏమైనా ఈ సారి హైద రాబాద్ ట్రిప్ మంచి ఫలితాన్నే ఇచ్చింది.

***

ఎస్ఎఫ్ఓలో పరిమళ లగేజ్ తీసుకుని బయ టకు వచ్చేటప్పటికి బేబీ నవ్వుతూ ఎదురొచ్చింది. కూతుర్ని ప్రేమగా గుండెలకు హత్తుకుంది.

''మమ్మీ ఇతను నా ఫ్రెండ్ హరిగోపాల్....'' అంటూ ఒక కుర్రాడ్ని పరిచయం చేసింది.

పరిమళ ఆశ్చర్య పోయింది. తను వెళ్లే ముందు వరకు వినోద్ అనే కుర్రాడు వస్తుండేవాడు. వాడ్ని ఎలా దూరం చేయటమా అన్న ఆలోచనలో ఉన్న పరిమళకు ఎర్రగా, సన్నగా,పొడుగ్గా ఉన్న ఈ కుర్రాడిని తన ఫ్రెండ్ అంటూ బేబీ పరిచయం చేయటంతో ఏమనాలో తోచలేదు.

పరిమళ అక్కడి తెలుగు అసోసియేషన్‌లో చాలా కాలం పని చేసింది. ఆ చొరవతో అధ్యక్షుడికి త్యాగరాజు గురించి చెప్పింది. అతన్ని అమెరికా పిలిపించి ఘనంగా సన్మానం చేయాలని నిర్ణయిం చారు.

అతని పద్యాలను సి.డి.ల రూపంలో విడుదల చేయటానికి పథకం వేశారు.

అమెరికాలోని తెలుగు సంఘం వారు త్యాగరాజుకి 'లైఫ్ టైం ఎచీవ్‌మెంట్' అవార్డు ఇస్తున్నట్లు ప్రకటించగానే హైదరాబాద్‌లో ప్రతిస్పందన మొదలైంది.

''మనవాడిక్కడ ఇన్ని వందల నాటకాలేసి గొంతు చించుకుని పద్యాలూ, పాటలూ పాడితే వినేసి ఎవరి మటుకు వాళ్లు దులిపేసుకుని వెళ్లిపో యారు. గవర్నమెంటూ కళ్లు తెరవలేదు. అమెరి కాలో ఉన్న వాళ్లు గుర్తించి 'లైఫ్ టైం ఎచీవ్‌మెంట్' అవార్డు ఇచ్చారు. ఇదీ వాళ్లకూ, మనకూ ఉన్న తేడా....'' అని అందరూ వేదికలెక్కి మైకులు పుచ్చు కుని మరీ పొగిడారు.

రెండు నెలల తర్వాత కాలిఫోర్నియాలో త్యాగ రాజుకు తెలుగు వారంతా ఘన సన్మానం చేశారు. 'లైఫ్ టైం ఎచీవ్‌మెంట్' అవార్డు ఇచ్చారు. ఆయన పాడిన పద్యాలు సి.డి.లు అమ్మకానికి పెట్టారు. అప్పటికప్పుడు అయిదువేల డాలర్లు వచ్చాయి.

ఆ సన్మానానికి త్యాగరాజు కృతజ్ఞతలు తెలియ జేశాడు.

''నేను కలలో కూడా ఊహించని సంఘటన ఇది. ఇవాళ్టితో నిజంగానే నాకు జీవన సాఫల్యం లభించింది. ఇంక నేను జీవితంలో ఆశించా ల్సిందేమీ లేదు. దేవుడి దగ్గర నుంచి ఈ క్షణంలో పిలుపు వచ్చినా వెళ్లటానికి సిద్ధంగా ఉన్నాను. ఈ అపూర్వమైన సత్కారం లభించటానికి కారకులైన వారందరికీ, ప్రత్యక్షంగా,పరోక్షంగా కారకులైన వారందరికీ వినమ్రుడనై కృతజ్ఞతలు తెలియచేసు కుంటున్నాను'' అన్నాడు.

ప్రోగ్రాం అయిపోయింది.

త్యాగరాజు, పరిమళ,బేబీ బయట ఉన్న కారు దగ్గరకు వచ్చారు. అక్కడొక పోలీసు వీళ్ల కోసం ఎదురు చూస్తున్నాడు.

''హూ ఈజ్ బేబీ?'' అని అడిగాడు.

విషయం ఏమిటని అడిగింది పరిమళ.

బేబీ పాత ఫ్రెండ్ వినోద్, కొత్త ఫ్రెండ్ హరిగో పాల్‌ను పిస్టల్‌తో కాల్చాడట. హరిగోపాల్ హాస్పట ల్‌లోనూ, వినోద్ పోలీసు స్టేషన్‌లోనూ ఉన్నారట. బేబీ వచ్చి స్టేషన్‌లో స్టేట్‌మెంట్ ఇవ్వాలని చెప్పాడు.

ముగ్గురూ పోలీసు స్టేషన్‌కీ, అక్కడి నుంచి హాస్పటల్‌కీ వెళ్లి వచ్చేటప్పటికీ రాత్రి పన్నెండు గంటలైంది.

మౌనంగా భోజనాలు ముగించి పడుకున్నారు.

తెల్లవారుజామున మూడు గంటలకు త్యాగరా జుకు మెలుకువ వచ్చింది. లేచి చూస్తే పరిమళ ఒక్కతే బాల్కనీలో కూర్చుని ఉంది. త్యాగరాజు ఆమె దగ్గరకు వెళ్లాడు. ఆమె కన్నీళ్ళు తుడుచుకుని, అతన్ని కూర్చోమంది.

''జరిగిన దానిలో బేబీ తప్పేమీ లేదు. ఆ కుర్రాడు అనవసరంగా ఆవేశపడితే, పాపం ఈ పిల్ల ఏం చేస్తుంది... చెప్పు!'' అంటూ ఓదార్పు మాటలు చెప్పాడు.

''తప్పొప్పుల సంగతి అలా ఉంచి, కాలం తెచ్చిన మార్పుల గురించే ఆలోచిస్తున్నాను, రాజూ...ఇదివరకు ఒక ఉద్యోగంలో చేరితే రిటైర య్యేదాకా దిగులుండేది కాదు. పెన్షన్ కూడా వచ్చేది. అది అతనికి 'లైఫ్‌టైం ఎచీవ్‌మెంట్'లా ఉండేది...ఇప్పుడలా కాదు.

ఆఫీసుకి వెళ్లేదాకా ఆ రోజు ఉద్యోగం ఉందో... ఊడిందో తెలియదు.

ఇదివరకో ఇల్లు కట్టుకుంటే అది అతనికి లైఫ్‌టైం ఎచీవ్‌మెంట్. నిశ్చింతగా ఆ ఇంట్లో జీవితం వెళ్లిపోయేది. ఇప్పుడలా కాదు...మనకు తెలియకుండానే మన ఇల్లు ఎవడో ఇంకెవడికో అమ్మేస్తాడు. అద్దెకిస్తే వాడ్ని లేపటానికి నానా తంటాలు పడాలి. ఇది వరకు ఓ స్నేహితుడుంటే జీవితాంతం అండగా నిలబడేవాడు. ఇప్పుడు స్నేహితుడు నమ్మకంగా వుంటూ నట్టేట ముంచే స్తాడు మనం జాగర్తగా ఉండకపోతే...ఎన్ని లక్షల జీతం వచ్చే ఉద్యోగం ఉన్నా, ఎన్ని కోట్ల ఆస్తి ఉన్నా, ఎంత మంది స్నేహితులున్నా...మనిషికి మన శ్శాంతి లేదు. ఇదీ ఈనాటి జీవన చిత్రం...ఈ తరం వాళ్ల బతుకులు ఇంత అనిశ్చితమైపోయాయే! అని బాధ'' అన్నది పరిమళ.

''గత కాలమే మేలు వచ్చు కాలము కంటెన్'' అన్నాడు త్యాగరాజు.

నిర్జనంగా ఉన్న రోడ్డు మీద ఓ కుక్క నింపా దిగా నడుచుకుంటూ వెళ్తోంది....కాపలా కాయా ల్సిన ఇంటిని వదిలి.

★

